

సోమశిలలో 27.616 టీఎంసీలు

జలాశయంలో సోమవారానికి 27.616 టీఎంసీలు ఉన్నాయి. 3,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. పెన్నార్‌డెల్టాకు 4,300, ఉత్తర, దక్షిణ కాలువలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,749
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,206
3 శాతం జీఎస్టీతో	రూ.9,482
నవర (8 గ్రా)	రూ.75,856

గరిష్టం/కనిష్టం
31.3 /25.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖాధికారులు తెలిపారు. సోమవారం గాలిలో తేమ 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పర్వతరెడ్డి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ కేంద్ర కార్యాలయం సోమవారం వెల్లడించింది. కూటమి ప్రభుత్వం మోపుతున్న అక్రమ కేసులతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా కేంద్ర కారాగారంలో ఉండడంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులోకి వచ్చే వరకు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వ అక్రమ కేసుల కారణంగా పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అందుబాటులో లేనందున నెల్లూరు జిల్లా కోర్డినేటర్‌గా మాజీమంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది.

పోలీసుల అదుపులో బిరదవోలు

- రుస్తుం మైనింగ్ కేసులో కొనసాగుతోన్న కక్ష సాధింపు చర్యలు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ పేరుతో అక్రమ కేసులు, అరెస్ట్‌ల పరంపర కొనసాగుతోంది. సోమవారం వైఎస్సార్‌సీపీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా కక్ష సాధింపు చర్యలకు పూనుకుంది. అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు వారి ముఖ్య అనుచరులను అక్రమంగా కేసుల్లో ఇరికించి పైశాచికానందం పొందుతోంది. రుస్తుం మైనింగ్ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. తాజాగా మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి అక్రమంగా కేసులో ఇరికించారు. ఆయనకు మైనింగ్‌లో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ అనిల్‌కుమార్‌తో సన్నిహితంగా ఉండడంతో కేసులో పేరును చేర్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం బిరదవోలు ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నెల్లూరురూరల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణు నేతృత్వంలోని ప్రత్యేక బృందం సోమవారం హైదరాబాద్‌కు చేరుకుంది. బిరదవోలును అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు గోప్యంగా ఉంచారు. మంగళవారం బిరదవోలును న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచే అవకాశం ఉంది.

నల్లపరెడ్డికి పోలీసుల నోటీసు జారీ

- 25న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు



నెల్లూరులో ప్రసన్నకుమార్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న కోవూరు ఎస్సై

నెల్లూరు (క్రైమ్): మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఈ నెల 25న విచారణకు హాజరు కావాలని కోవూరు పోలీసులు సోమవారం రాత్రి నోటీసును అందజేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై కోవూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో విచారణ నిమిత్తం ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయానికి రావాలని సీఐ వి.సుధాకర్‌రెడ్డి నోటీసు జారీ చేశారు. ఆ మేరకు కోవూరు ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్ నెల్లూరులోని ప్రసన్న నివాసానికి చేరుకుని ఆయనకు నోటీసు అందజేశారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లను మండలాల వారీగా ప్రారంభించేందుకు నిరుద్యోగ బీఈడీ, డీఈడీ అభ్యర్థులు, ఆ ఆవాస ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బడి మానేసిన పిల్లలు, ఇప్పటి వరకు బడికి వెళ్లని పిల్లలు, వివిధ పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ ద్వారా శిక్షణ ఇప్పించి బడిలో చేర్పించేందుకు వలంటీర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

ఈజీ మనీతో మనీ ఈజ్ హనీ



ఈజీ మనీతో రంగుల ప్రపంచంలో విహరించాలనుకున్నారు. సినిమాల్లో మాదిరి పేపర్లపైనే ఫేక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను సృష్టించారు. అమాయకులు, నిరక్షరాస్యులైన గిరిజనులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చిత్రీకరించారు. బ్యాంక్ అధికారులను లోబర్చుకుని రూ.కోట్లల్లో రుణాలు తీసుకుని 'మనీ ఈజ్ హనీ' సినిమాను తీశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడులో కూడా బ్యాంకులను ముంచేసినట్లు తెలుస్తోంది. బాధితులు కొన్ని నెలల ముందే పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ ఆర్థిక నేరస్తులు అధికార టీడీపీ నేతల అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. తాజాగా ఈ మోసం వెలుగులోకి రావడంతో అమాయక బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.



➡ 'ఈమె పేరు తనూజ. ఆమె భర్త మోషేజ్‌తో కలిసి ఏడేళ్ల కిందట బతుకుదెరువు కోసం నెల్లూరుకు వచ్చారు. జాలె వాసుదేవనాయుడు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ సంస్థలో మోషేజ్ సెక్యూరిటీ గార్డుగా, తనూజ అదే ఆఫీసులో ఆయాగా పని చేస్తోంది. వారికి కొంత డబ్బు అవసరమై వాసుదేవనాయుడును అప్పు అడిగారు. ఆధార్ కార్డు ఇస్తే కొంత లోను ఇప్పిస్తానని ఆశ కల్పించి రెండు విడతలుగా రూ.5 లక్షలిచ్చాడు. ఆ లోను తీరేంత వరకు నెలవారీ కంతులు కట్టించుకున్నాడు. మూడేళ్ల క్రితం యాక్సిస్ బ్యాంకు అధికారులు తనూజకు ఫోన్ చేసి నెల్లూరు, రాజమండ్రి, జగ్గయ్యపేట బ్రాంచ్‌ల్లో దాదాపు రూ.1.60 కోట్లు రుణం తీసుకున్నారని, ఆ కంతులు చెల్లించాలని చెప్పడంతో వారు బిత్తరపోయారు. వాసుదేవనాయుడిని అడిగితే 'నీ దిక్కున్న చోట చెప్పుకోమని' చెప్పాడంట. ఈ పరిణామాలు చూసి మోషేజ్ భయపడి భార్యా, పిల్లలను వదిలి వెళ్లిపోయాడు. ఆమెకు ఇద్దరు చిన్న పిల్లలు. వారిని వదిలిపోలేక, కాయకష్టం చేస్తూ బ్యాంకుల చుట్టూ న్యాయం కోసం తిరుగుతోంది. నాలుగు నెలల కిందట తనూజ నెల్లూరు ఐదో నగర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా వారు తీసుకోలేదు. ఇక నాకు చావే గతని ఆమె వాపోతుంది.

తవ్వేకొద్ది వెలుగు చూస్తున్న కేటుగాళ్ల అక్రమాలు

- ఇప్పటి వరకు రూ.50 కోట్లపైనే ప్రాథమిక అంచనా
- తెలుగురాష్ట్రాలతోపాటు తమిళనాడు బ్యాంకులను ముంచేసిన మోసగాళ్లు
- ఆ డబ్బులతో సినిమాలు తీసి, రంగుల ప్రపంచంలో విహారం
- ఇందులో బ్యాంకు అధికారుల పాత్రపైనా అనుమానాలు
- ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న అమాయక బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- టీడీపీ నేతల అండతో స్వేచ్ఛగా తిరుగుతున్న ఆర్థిక నేరస్తులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ సానుభూతిపరుడైన ఓ జర్నలిస్టు, ఆ పార్టీ నేతలు జాలి వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్ కలిసి ఇటీవల విడుదలైన కుబేర సినిమాను తలపించే రీతిలో పాల్పడిన భారీ స్కామ్ సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు నెల్లూరు, ముత్తుకూరులోని యాక్సిస్ బ్యాంక్‌లను ముంచారని అనుకుంటుంటే తాజాగా తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడులోని పలు బ్యాంక్‌లను ఈ తరహాలో మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. తవ్వే కొద్దీ ఈ కేటుగాళ్ల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ ఆర్థిక నేరస్తులు యాక్సిస్ బ్యాంక్ అధికారులతో చేతులు కలిపి మోసానికి పాల్పడినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరేనా వీరికన్నా పెద్ద స్థాయి వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? అన్ని పూర్తి స్థాయి దర్యాప్తుతోనే వెలుగులోకి వస్తుంది.





కేటుగాళ్లు వాసుదేవనాయుడు, అల్లాభక్షు

అధికార పార్టీని అడ్డం పెట్టుకుని

కేటుగాళ్లు అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కేటుగాళ్లు చెలరేగిపోయారు. సీఎం చంద్రబాబునాయుడుతో పాటు టీడీపీలోని మంత్రులు, మాజీ ప్రముఖులతో దిగిన ఫొటోలు చూపించి చదువు లేని గిరిజనులను, బ్యాంక్‌లను రూ.కోట్లల్లో మోసం చేశారు. ఒక్క నెల్లూరులోనే కాదు రాజమండ్రి, జగ్గయ్యపేట, తమిళనాడు ప్రాంతాల్లో కూడా ఈ తరహా మోసాలు చేసినట్లు వెలుగులోకి వచ్చాయి. అమాయక గిరిజనులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వారి పేర్లతో రూ.కోట్లాది రుణాలు తీసుకుని కేటుగాళ్లు జల్సాలు, విందులతో పాటు సినిమాలు నిర్మించినట్లు తెలుస్తోంది.

రూ.వందల కోట్లల్లో అక్రమాలు

కుబేరా సినిమా తరహాలో జరిగిన ఈ స్కామ్‌లో బాధితులు సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల బ్యాంకులను మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు రూ.50 కోట్లకు పైగానే స్కామ్ చేసినట్లు సమాచారం. ఇంకా తవ్వేకొద్ది రూ.వందల కోట్లల్లో మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇంత విచ్చలవిడిగా ఘరానా మోసం చేస్తున్నా.. బ్యాంకు అధికారులు పసిగట్ట లేదా?. బ్యాంకు అధికారులు ప్రమేయంతోనే జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేటగాళ్ల బారిన పడి కుటుంబాలు చితికిపోయి ఆత్మహత్యే శరణ్యమనే పరిస్థితి వచ్చింది. కేటుగాళ్లు అధికార పార్టీ నాయకులు కావడంతో పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను కూడా స్వీకరించకపోవడంతో బాధితులు కాపురాలే నిలువునా కూలిపోతున్నాయి. కేటుగాళ్లు మాత్రం అమాయకులు కుటుంబాలను ఛిద్రం చేసి ఆ సొమ్ముతో జల్సాలు, విందులు, వినోదాలు చేసుకున్నారు. ఆ ఈజీ మనీతో సినిమాలు నిర్మించే స్థాయికి వెళ్లారంటే వారి స్కామ్ ఎంత పెద్దదో అర్థమవుతోంది. ఈ కేటుగాళ్ల లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి రావడంతో పోలీసులు తీరిగ్గా స్పందించి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు రికార్డులు తనిఖీలు చేస్తున్నారు. ఆ రికార్డులు చూస్తే పోలీసులు సైతం నివ్వెరపోయే విషయాలు ఉన్నట్లు సమాచారం. రూ.లక్ష లోను కావాలన్నా సవాలక్ష ఆంక్షలతో రుణం ఇచ్చే బ్యాంకు అధికారులు కేటుగాళ్లకు రూ. కోట్లల్లో రుణాలు ఎలా ఇచ్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన కేసు ఎఫ్ఐఆర్

రంగుల ప్రపంచంలోకి..

అమాయక ప్రజల రక్త మాంసాలను పీల్చి బ్యాంకులను నిలువుగా ముంచిన కేటుగాళ్లు ఈజీ మనీతో రంగుల ప్రపంచంలోకి అడుగు పెట్టారు. మనీ ఈజ్ హనీ అంటూ సినిమా తీశారు. విలాసవంతమైన భవనాలు, లగ్జరీ కార్లలో తిరుగుతూ కేటుగాళ్లు జల్సాలు, విందు వినోదాలతోపాటు స్వయంగా సినిమాలు నిర్మించే స్థాయికి వెళ్లారంటే వారి చేసిన స్కామ్ ఎంత పెద్దదో అర్థమవుతోంది. వాసుదేవనాయుడు, అల్లాభక్షు ఇద్దరు సొంత బ్యానర్‌లోనే వారే దర్శక, నిర్మాత, హీరోలుగా సినిమాలు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

కేటుగాళ్లకు అండగా అధికార పార్టీ నేతలు

ఆర్థిక నేరస్తులకు జిల్లాలోని అధికార పార్టీ నేతలు అండగా ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ మైనార్టీ విభాగ నేతగా ఉన్న అల్లాభక్షు రాష్ట్ర స్థాయిలో ఉన్న నామినేటెడ్ పోస్టులో ఉన్న కీలక వ్యక్తికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన రంగంలోకి దిగినట్లు సమాచారం. పోలీస్ విచారణలో కూడా అధికార పార్టీ నేతలు ఇన్వాల్ అవుతూ కేసు నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా ఉంది.



సీఎం చంద్రబాబుతో వాసుదేవనాయుడు



మంత్రి కొల్లు రవీంద్రతో..



మంత్రి నారాయణతో..



మాజీ డిప్యూటీ సీఎం చినరాజప్పతో..

యాక్సిస్ బ్యాంకు కుంభకోణం ప్రభుత్వ వైఫల్యమే

- ఈ స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణ చేయించాలి
- సూత్రధారులు, పాత్రధారులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలో కుబేర సినిమా తరహాలో యాక్సిస్ బ్యాంకులో జరిగిన కుంభకోణం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్ ఆరోపించారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు, ముత్తుకూరులో యాక్సిక్ బ్యాంకు బ్రాంచ్‌ల్లో కొందరు అమాయక గిరిజనుల ఆధార్ కార్డులు, ఫొటోలు, సిమ్ కార్డులు తీసుకుని మూడు బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను సృష్టించి, అందులో ఉద్యోగులుగా చూపించి వారి పేర్లతో రుణాలు తీసుకున్నారన్నారు. ఈ విషయమై ఎనిమిది నెలల క్రితమే నెల్లూరు యాక్సిస్ బ్యాంకు మేనేజర్ ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కుంభకోణంలో లంచాలు తీసుకున్న బ్యాంకు సిబ్బందితో పాటు ప్రధాన సూత్రధారులు, పాత్రధారులను వెంటనే అరెస్ట్ చేసి పూర్తిస్థాయిలో విచారణ చేయించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తప్పుడు వాంగ్మూలాలతో నాపై అక్రమ కేసులు

- ఎక్సైజ్ అధికారులకు కాకాణి దీటైన సమాధానాలు
- ఒక్క ఆధారమైనా చూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే
- కాకాణి ఎదురు ప్రశ్నలకు నీళ్లు నమిలిన అధికారులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'నేను తప్పు చేసినట్లు ఏ ఒక్క ఆధారం చూపించండి. ఏ శిక్షకైనా నేను సిద్ధంగా ఉన్నాను. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం, సర్వేపల్లిలో జరిగే అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకు బలవంతంగా తీసుకున్న తప్పుడు వాంగ్మూలాలతో నాపై తప్పుడు కేసులు బనాయించారు. ఈ రెండు రోజుల కస్టడీలో నా ప్రమేయం ఉన్నట్లు ఒక్క ఆధారం చూపించినా నేను స్పందిస్తానంటూ మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. పొదలకూరు మండలం ఇరువూరులో గత ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం కేసులో మాజీ మంత్రి కాకాణిపై అక్రమంగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం రెండు రోజుల పాటు ఎక్సైజ్ శాఖ అధికారుల న్యాయమూర్తి ఆదేశాలతో సోమవారం తమ కస్టడీకి తీసుకున్నారు. కాకాణి తరఫు న్యాయవాది కే చంద్రశేఖర్ సమక్షంలో తొలి రోజు 50 ప్రశ్నలకు కాకాణి దీటైన సమాధానాలు ఇచ్చారు. 'నా మీద ఉన్నవి కేవలం ఆరోపణలే తప్ప వాస్తవాలు కావనే విషయం మీకూ తెలుసు. నిజానిజాలు మీ దర్యాప్తులో తేల్చాలి. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం బలవంతపు వాంగ్మూలాలతో నమోదు చేసిన అక్రమ కేసే ఇది. నేను మిమ్మల్ని స్పష్టంగా కోరేది ఈ రెండు రోజుల కస్టడీలో నా మీద మీరు సేకరించిన ఆధారాలు చూపించండి. అప్పుడు స్పందిస్తాను' అని ఎక్సైజ్ అధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

అక్రమ ప్రయోజనాన్ని ఆశించాల్సిన అవసరం లేదు

'నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నడూ అక్రమ ప్రయోజనాన్ని ఆశించలేదు. మీ విచారణలో నేను దోషిగా తేలితే ఎటువంటి శిక్షకైనా సిద్ధం. బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, చొప్ప రమేష్, కేతు రామిరెడ్డి, వెలిమిరెడ్డి వీరందరు వైఎస్సార్‌సీపీ నేతలు కావడంతో వారిని ఈ కేసుల్లో అన్యాయంగా ఇరికించారు. వారితో నేను తరచూ గ్రామాభివృద్ధి విషయాలు మాత్రమే మాట్లాడుకుంటాం. అభియోగాలకు, వాస్తవాలకు చాలా వ్యత్యాసం ఉంది. మీరు అడిగే ప్రశ్నలన్నీ ఊహా జనీతం. డొంక తిరుగుడు ప్రశ్నలు కాకుండా నాపాత్రపై నిర్దిష్టమైన ఆధారాలు చూపిస్తే నేను సమాధానం చెప్పగలను. నేను మద్యం ద్వారా ఓటర్లను ప్రభావితం చేయాలన్న ఆలోచనే చేయలేదు' అని ఎక్సైజ్ అధికారుల ప్రశ్నలకు కాకాణి దీటైన సమాధానాలు ఇచ్చారు.

మొదటి రోజు కాకాణి విచారణ పూర్తి

నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పొదలకూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు సోమవారం విచారించారు. పొదలకూరు మండలం విరువూరులో మద్యం అక్రమ నిల్వలు ఉంచారంటూ 9వ నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని గూడూరు కోర్టు అనుమతితో పొదలకూరు ఎక్సైజ్ అధికారులు రెండు రోజుల విచారణ నిమిత్తం సోమవారం తమ కస్టడీకి తీసుకుని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. కాకాణిని ఆయన తరఫు న్యాయవాది కోరికల చంద్రశేఖర్ సమక్షంలో 50 ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పొదలకూరు మండలం తోడేరు, పొదలకూరు-3 వీఆర్‌ఓలు గద్దం వేణుగోపాల్, అల్లాడి శ్రీనివాసులు మధ్యవర్తులుగా ఉంచి ఈ విచారణ చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.



మున్సిపల్ కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉద్రిక్తంగా మున్సిపల్ కార్మికుల ఉద్యమం

- టెండర్లను రద్దు చేయాలంటూ ధర్నా
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నం
- భారీగా పోలీసులను మోహరించి అడ్డుకున్న వైనం
- మహిళా కార్మికులకు రక్తగాయాలు




నెల్లూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. మా కడుపులు కొట్టొద్దు, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్‌కు చేరుకున్న మున్సిపల్ కార్మికులు బైఠాయించి కలెక్టర్ వచ్చి తమ సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకొని గేట్లు వేశారు. కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తోపులాటలో నలుగురు మహిళా కార్మికులకు రక్త గాయాలయ్యాయి. ఇద్దరు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. తోటి కార్మికులు వెంటనే వారిని ఆస్పత్రులకు తరలించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులతో పోలీసులు చర్చ జరిపి కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం యూనియన్ నాయకులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.మోహన్‌రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య మాట్లాడారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం పారిశుద్ధ్య కార్మికుల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలకు పాల్పడడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనిది మొట్టమొదటిగా నెల్లూరు నుంచే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే చర్యలకు మంత్రి పూనుకున్నారన్నారు. తక్షణమే పిలిచిన టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా నిర్దాక్షిణ్యంగా పనిలో ఆపివేయడం తగదన్నారు. జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ విభాగం కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నెల్లూరు నగర నాయకులు పి సూర్యనారాయణ, రూరల్ నాయకులు సుధాకర్, నాగేశ్వరరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

23 నుంచి ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 23వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న మెరిట్ నంబరు 1 నుంచి 90వ వరకు, మధ్యాహ్నం 91 నుంచి 180 వరకు, 24న ఉదయం 181 నుంచి 270 వరకు, మధ్యాహ్నం 271 నుంచి 359 వరకు, 25న జనరల్ పూల్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఐటీఐలోని ఆయా కోర్సుల్లో చేరదలచుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు బాలుర ఐటీఐని సంప్రదించాలన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం

- కలెక్టర్ ఆనంద్ అసహనం
- తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు
- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 249 వినతుల అందజేత


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: 'ప్రజలు అందించే వినతులను పరిష్కరించే విషయంలో కొన్ని శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. సత్వరమే చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ ఒ.ఆనంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికంగా రెవెన్యూ శాఖవి 103, సర్వే అండ్ ల్యాండ్ రికార్డులవి 16, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌వి 16, పంచాయతీరాజ్‌వి 16, స్కూల్ ఎడ్యుకేషన్‌వి 15, పోలీస్ శాఖవి 11, ఇంకా తదితర శాఖలకు సంబంధించి మొత్తం 249 ఫిర్యాదులు వినతులందాయి.

- కలెక్టర్ మాట్లాడుతూ సర్వే, ఎడ్యుకేషన్, పోలీస్, గనుల శాఖ, డిజేబుల్ వెల్ఫేర్, దేవదాయ శాఖ తదితరాలు వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి శాఖ కూడా ఫిర్యాదులు విషయంలో ఆడిట్ నిర్వహించుకోవాలని సూచించారు. వినతుల విషయంలో అలసత్వం ఉండకూడదని తెలిపారు.

ఇనాం భూమి ఆక్రమణ

ఇనాం భూములు ఆక్రమించి కంచె వేస్తున్నారని నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామస్తులు వినపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇనాం రద్దు చట్టం వచ్చిన తర్వాత 350 ఎకరాలను తాళ్లపూడికి చెందిన మెట్ట రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వానికి సరెండర్ చేసి పరిహారం పొందారన్నారు. అందులో 110 ఎకరాల్లో పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆయన కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి పరిహారానికి 6 శాతం అదనంగా డబ్బు కట్టి 20 మంది పేర్లతో దొంగ పాసు పుస్తకాలు సృష్టించారన్నారు. ఈ పట్టాలు చెల్లవని అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇప్పుడు మళ్లీ వాటిని చూపించి కంచె వేసి ఆక్రమించుకుంటున్నారని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా సెక్షన్ 145 పెట్టి మెతక వైఖరి అవలంబిస్తున్నారని చెప్పారు.

హత్య కేసును పక్కదారి పట్టిస్తున్నారు



నా భర్త గొల్లపల్లి చిన్నయ్యను వేదాయపాళెంలో ఈ ఏడాది మేలో హత్య చేశారు. ఆయన సీతారామపురం మండలంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. డాక్టర్ సత్తెనపల్లి ఓబుల్‌రాజు, అతని భార్య ఆదిలక్ష్మితో కలిసి వ్యాపారాలు చేశారు. హత్య జరిగిన స్థలంలో నగదు, బంగారం, డాక్యుమెంట్లు మాయం చేశారు. వేదాయపాళెం పోలీసులు వారిపై దర్యాప్తు చేయకుండా కేసును పక్కదారి పట్టిస్తున్నారు. పార్ట్‌నర్స్‌తో జరిపిన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఫోన్ కాల్స్, ఆస్తులపై ప్రత్యేకంగా దర్యాప్తు జరపాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి వేళాంగిణి, ఉదయగిరి

రోడ్లు, కాలువలు నిర్మించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంగం మండలం జెండా దిబ్బ గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు సత్వరమే నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ కె.సంజయ్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దారుణంగా ఉన్న రోడ్ల వల్ల గర్భిణులు, రోగులు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జున్‌రెడ్డి, సిరివెళ్ల నరేష్, న్యాయవాది సుధాకర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం వేధింపులు

- కుమారుడు, కోడలిపై ఫిర్యాదు
- పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 82 వినతులు


బాధితుల సమస్యలు వింటున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు (క్రైమ్): 'ఆస్తి కోసం నా కుమారుడు, కోడలు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బాగోగులు పట్టించుకోవడం లేదు. విచారించి చర్యలు తీసుకోవాలి' అని కావలి రూరల్ పరిధికి చెందిన ఓ వ్యక్తి కోరాడు. అలాగే ఉద్యోగం పేరిట మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 82 మంది విచ్చేసి నగర, మహిళా పోలీస్‌స్టేషన్ల డీఎస్పీలు పి.సింధుప్రియ, చెంచురామారావులకు వినతులు అందజేశారు. వాటిని పరిశీలించి ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ–2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- అంకమరాజు పోస్టల్ ఉద్యోగి. ఆ శాఖలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా స్పందించలేదు. నగదు తిరిగివ్వాలని అడిగితే బెదిరిస్తున్నాడని బాలాజీ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు.
- నాకు తిరుపతిలోని ఓ లాజిస్టిక్ కంపెనీ మేనేజర్ శ్రీకాంత్ పరిచయమయ్యాడు. అతను ఆ కంపెనీ నెల్లూరు బ్రాంచ్‌లో సీనియర్ సేల్స్ మేనేజర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని, నెలకు రూ.70 వేల జీతం, రూ.30 వేలు ఇన్సెంటివ్ వస్తుందని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడు. జాబ్ ఇప్పించకుండా, నగదు తిరిగివ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని చిన్నబజారు పరిధికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- కాకినాడకు చెందిన ఏజెంట్ స్వామినాథన్ విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మా అమ్మను మస్కట్ పంపాడు. అక్కడ ఆమెకు జాబ్ ఇప్పించలేదు. ప్రస్తుతం అమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. మస్కట్ నుంచి తిరిగి ఇండియాకు రప్పించాలని ఏజెంట్‌ను కోరినా పట్టించుకోవడం లేదని నెల్లూరు రూరల్ పరిధికి చెందిన అర్జీ ఇచ్చాడు.
- నా భర్త మృతిచెందాడు. అప్పటి నుంచి నేను మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. అదే ప్రాంతానికి చెందిన హరిబాబు, వెంకటరామయ్య వివిధ రకాలుగా వేధిస్తున్నారు. వారు చెప్పినట్లు వినాలని నాపై దాడి చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని కావలికి చెందిన ఓ మహిళ కోరారు.
- నా భర్త, అత్తమామలు అదనపుకట్నం కోసం వేధిస్తూ ఇంటి నుంచి గెంటేశారు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని వేదాయపాళేనికి చెందిన ఓ వివాహిత విజ్ఞప్తి చేశారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా

- నిందితులపై ఏపీ, తమిళనాడులో వందకుపైగా కేసులు

నెల్లూరు(క్రైమ్): తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పట్టపగలే చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఆదివారం కావలి వద్ద నెల్లూరు, తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 19వ తేదీన నెల్లూరు నగరంలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు తెగబడ్డారు. చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉమాకాంత్ ఇంట్లో రూ.30 వేల నగదు, 12 గ్రాముల బంగారు ఆభరణాలు, సోమేశ్వరి ఇంట్లో 36.75 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుచ్చయ్య ఇంట్లో 50 సవర్ల బంగారు, కిలో వెండి వస్తువులను దోచుకెళ్లారు. చిన్నబజారు పరిధిలో మరో ఇంట్లో చోరీకి యత్నించారు. ఏమీ లేకపోవడంతో వెనుదిరిగారు. అప్రమత్తమైన నెల్లూరు పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తును ప్రారంభించారు. ఘటనా స్థలంతోపాటు సీసీ టీవీ పుటేజీల్లో లభ్యమైన ఆధారాల ద్వారా చోరీలకు పాల్పడింది తమిళనాడు ముఠానేనని గుర్తించారు. అప్పటికే వారి కోసం గాలిస్తున్న తిరుపతి పోలీసులు నెల్లూరు పోలీసులను సంప్రదించారు. ఆదివారం కావలి వద్ద ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడసాగారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతోపాటు పలు రాష్ట్రాల్లో వందకుపైగా కేసులున్నట్లు సమాచారం. వారు నెల్లూరు కంటే ముందుగా తిరుపతి జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. అక్కడి పోలీసులు గాలిస్తుండగా ఈనెల 19వ తేదీన నెల్లూరు నగరంలో వరుస దొంగతనాలు జరిగాయని సమాచారం అందడంతో ఇక్కడి పోలీసులను సంప్రదించారు. నిందితులు ఒక జిల్లాలో దొంగతనాలు చేసిన అనంతరం మరో జిల్లాకు మకాం మార్చి అక్కడ నేరాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుంటారని తెలిసింది.

క్లుప్తంగా

చెరువు భూముల్లో చేపల గుంతలు

- టీడీపీ నాయకులపై చర్యలకు వినతి


మాట్లాడుతున్న విజయమ్మ

నెల్లూరు(అర్బన్): చేజర్ల మండలంలోని కోటితీర్థంలో చెరువు లోతట్టు భూములను ఆక్రమించి చేపల గుంతలుగా మార్చిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన కొమ్మి విజయమ్మ డిమాండ్ చేశారు. ఆమె సోమవారం కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ చెరువు కింద తాను, మరో పదిమంది రైతులు వరి సాగు చేసుకుంటున్నామన్నారు. టీడీపీకి చెందిన రత్తయ్య, మరో ఐదుగురు చెరువు అలుగు ప్రాంతంలో 50 ఎకరాలు ఆక్రమించి చేపల గుంతలుగా మార్చారన్నారు. కొందరు ఇతర ప్రాంతాల వారికి లీజుకు కూడా ఇచ్చారన్నారు. చెరువు తూములు పగుల గొట్టారన్నారు. దీంతో నీరు వెళ్లే మార్గం లేక తమ పట్టా పొలాల్లోకి చెరువు నీరు వచ్చి పైరు కుళ్లిపోతోందన్నారు. దీనిపై కలెక్టరేట్‌కు ఇప్పటికి పదిసార్లు వచ్చి అర్జీలు ఇచ్చామన్నారు. ఇటీవల తమ ఫిర్యాదుపై ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు వచ్చి పరిశీలించారని, అయితే ఇంకా న్యాయం చేయలేదన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతామని జేసీ చెప్పారన్నారు.

పక్కగా గ్రామసభలు


నెల్లూరు రూరల్: జిల్లాలో పీ–4 గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం తిక్కన ప్రాంగణంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపికపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులందరూ తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం, ఆర్థికంగా స్థిరపడిన మార్గదర్శులను ఎంపిక చేసేందుకు సభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ మోహన్‌రాజు, సీపీఓ నరసింహారావు, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూరు: బాలికకు మాయమాటలు చెప్పి ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆత్మకూరు ఎస్సై ఎస్‌కే జిలానీ సోమవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఏపీఎస్ఆర్ కాలనీలో ప్రణవ్ అనే 20 ఏళ్ల యువకుడు నివాసం ఉంటున్నాడు. అతను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా ఉన్నాడు. ఓ బాలిక పాఠశాలలో చదువుతోంది. ఈనెల 17వ తేదీన బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ప్రణవ్ వెళ్లి లైంగికదాడి చేశాడు. నాలుగు రోజులుగా బాలిక స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో ఆమె తల్లి ప్రశ్నించి వివరాలు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:134
లేయర్ (లైవ్)	:112
బ్రాయిలర్ చికెన్	:240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:264
లేయర్ చికెన్	:190

విశ్రాంతే మెదడుకు ఔషధం

- ఒత్తిడి, జంక్‌ఫుడ్, కాలుష్యం, నిద్రలేమితో భారం
- పెరుగుతున్న బ్రెయిన్ సంబంధిత వ్యాధిగ్రస్తులు
- అవగాహనతోనే చెక్
- నేడు ప్రపంచ మెదడు దినోత్సవం



నెల్లూరు(అర్బన్): శరీరంలో అతి ముఖ్యమైన అవయవం మెదడు. దాని పనితీరు బాగుంటేనే చురుగ్గా పని చేయగలుగుతారు. అయితే నేడు పరిస్థితులు మరోలా ఉన్నాయి. జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఇంకోవైపు కాలుష్యం పెరిగిపోయింది. సమయపాలన లేకుండా పగలు, రాత్రి ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకో వైపు మొబైల్ స్క్రీన్లకు అలవాటు పడి అర్ధరాత్రి వరకు నిద్ర పోవడం లేదు. దీంతో మెదడుపై ఒత్తిడి పెరిగింది. గతానికి భిన్నంగా ఆటో ఇమ్యూన్ ఎన్సెఫాలిటిస్, బ్రెయిన్ స్ట్రోక్, బ్రెయిన్ ట్యూమర్, మతిమరుపు, పార్కిన్‌సన్స్ (వణుకుడు జబ్బు) బారిన పడుతున్నారు. వెరసి మెదడు ఆరోగ్యాన్ని చేజేతులా పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థలో భాగమైన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ (డబ్ల్యూఎఫ్ఎన్) ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రపంచ మెదడు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 22వ తేదీన నిర్వహిస్తోంది. నరాల సంబంధిత వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

60 శాతానికి పైగా..

జిల్లాలో 60 శాతానికి పైబడి ప్రజలు ఒత్తిడితోనే జీవిస్తున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పేర్కొంటోంది. ఒత్తిడి, బీపీ, షుగర్ వల్ల కూడా అనేక రకాల మెదడు సమస్యలు వస్తున్నాయి. మెదడు, నరాలు పనితీరు లోపించడంతో 50 ఏళ్ల వయసు పైబడిన వారికి మతిమరుపు, పార్కిన్‌సన్స్ లాంటి జబ్బులు వస్తున్నాయి. ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరిగింది.

పెద్దాస్పత్రిలో ఇలా..

నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి న్యూరాలజీ విభాగానికి నెలకు సుమారు 350 మందికి పైగా రోగులు వస్తున్నారు. నారాయణ ఆస్పత్రిలో ఆ సంఖ్య వెయ్యిగా ఉంది. అలాగే మెడికవర్, అపోలో ఆస్పత్రి, కిమ్స్ తదితర చోట్ల మరో 5 వేల మంది, ఇతర న్యూరాలజీ డాక్టర్ల వద్దకు వచ్చే వారితో కలిపితే నెలకు జిల్లాలో సుమారు 10 వేల మంది రోగులు వైద్యం కోసం వెళ్తున్నారు. వీరిలో 30 శాతానికి పైగా రోగులు మెదడు సంబంధిత రోగులుగా ఉన్నట్లు అంచనా. కొంతమందికి మతిమరుపు ఉంది. మరికొందరు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఇంకొంతమంది పార్కిన్‌సన్స్ (వణుకుడు) జబ్బుతో బాధపడుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లాంటి సమస్యలు వస్తే కోలుకోవడం కష్టంగానే ఉంటుంది.

ఆరోగ్యంగా ఉండాలంటే..

రోజూ 8 గంటలు నిద్రపోవాలని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. యోగా, ప్రాణాయామం చేయాలి. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. జంక్‌ఫుడ్ జోలికి వెళ్లకూడదు. అన్నం, గోధుమ పిండి, చక్కెరలు సాధ్యమైనంత వరకు తగ్గించాలి. పుస్తకాలు చదవాలి. ఫిజికల్ యాక్టివిటీస్ జరగాలి. అప్పుడు మెదడుపై ఒత్తిడి తగ్గి పలు రకాల జబ్బులు అరికట్టబడతాయి. అయితే వైరస్‌ల వల్ల వచ్చే జపనీస్ ఎన్సెఫాలిటిస్ లాంటి జబ్బులకు మొదట్లోనే చికిత్స తీసుకుంటే ఇబ్బంది ఉండదు.

అవగాహన తప్పనిసరి



మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజలు తగిన అవగాహన పెంచుకోవాలి. ఒత్తిడి వల్ల వచ్చే బ్రెయిన్‌స్ట్రోక్, మతిమరుపు, పార్కిన్‌సన్స్ లాంటి జబ్బులను అరికట్టాలంటే రాత్రి పూట తగినంత నిద్ర అవసరం. పౌష్టికాహారం తీసుకోవాలి. వ్యాయామం తప్పనిసరి. కాలుష్యానికి దూరంగా ఉండాలి.

– డాక్టర్ ధీరజ్, న్యూరోసర్జన్, జీజీహెచ్

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఆరు కేజీల స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులతో అధికారులు

నెల్లూరు(క్రైమ్): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. సోమవారం నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రం దిండుగల్ జిల్లాకు చెందిన కన్నదాసన్, రాజేశ్వరన్‌ను అదుపులోకి తీసుకుని, వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో ఉన్న ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను ఎక్సైజ్ నెల్లూరు–1 స్టేషన్‌కు తరలించారు. విచారణలో తునికి చెందిన సతీష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తమ ప్రాంతంలో అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించడంతో కేసు నమోదు చేశారు. సతీష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్సై కాలేషావలీ, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, కానిస్టేబుల్స్ గిరిబాబు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకపక్షమే!

- నోటీసుల పేరుతో పచ్చపాతం
- నిమ్మతోటల్ని నరికేసేందుకు కుట్రలు

సైదాపురం: కొందరు రైతులపై అధికారులు పక్షపాతం చూపిస్తున్నారు. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను వందలాది మంది సాగు చేసుకుంటున్నారు. అయితే వారిలో కొందరిపైనే కక్ష సాధించేందుకు అధికార పార్టీ నేత యంత్రాంగాన్ని ఉసిగొల్పుతున్నారు. మండలంలోని అనంతమడుగు, లింగసముద్రం, తలుపూరు, తిప్పిరెడ్డిపల్లి, మునగపాడు, తోచాం గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాలు మేత, కొండ పోరంబోకు భూములున్నాయి. వాటికి ఎలాంటి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేయకపోయినా పేద రైతులు ఎకరా, అరెకరా వంతున సాగు చేసుకుంటూ జీవనం సాగించుకుంటున్నారు. సైదాపురంలోని 793ఏ సర్వే నంబర్‌లో 114 ఎకరాల కొండ పోరంబోకు భూమి మైనింగ్ లీజులో ఉండేది. కొన్నేళ్ల క్రితం లీజు గడువు ముగిసింది. దీంతో సైదాపురం, కమ్మవారిపల్లెకు చెందిన గిరిజన కుటుంబాలతోపాటు మరో 21 మంది రైతులు ఆ భూముల్లో నిమ్మ తోటలను సాగు చేపట్టారు. వారందరిలో కేవలం ఇద్దరు, ముగ్గురు రైతులపై ఆ నేత కక్ష సాధింపు చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులను నుంచి కూడా ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం

చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. నేను ఇటీవల బాధ్యతలు చేపట్టాను. ఎవరిపై కక్ష సాధించే అవసరం నాకు లేదు. చట్ట ప్రకారమే నోటీసులు జారీ చేశాం. అలాగే జాయింట్ సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

– సుభద్ర, తహసీల్దార్, సైదాపురం

న్యాయం చేయండి

తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వ భూముల్లో నిమ్మ సాగు చేసుకుంటున్న రైతులు అధికారులను కోరుతున్నారు. అప్పు చేసి పెట్టుబడులు పెట్టామని, పంట చేతికొచ్చే సరికి ఆ భూములను లాక్కునే ప్రయత్నం చేయడం సరికాదని వాపోతున్నారు. మండలంలో సుమారు 3 వేల నుంచి 4 వేల ఎకరాలకు పైగా కొండ పోరంబోకు, మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, కేవలం తమ భూములకే నోటీసులిచ్చి విచారణ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

అక్రమ మైనింగ్‌పై గ్రామస్తుల కన్నెర్ర


క్వారీ వద్ద పొక్లెయినర్

కొండాపురం(ఉదయగిరి): కొండాపురం మండలంలోని యర్రబొట్లపల్లిలో ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్‌ను ఇటీవల గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్రమార్కులు మళ్లీ సోమవారం క్వార్ట్జ్ వెలికితీసే నిమిత్తం బ్లాస్టింగ్ చేపట్టారు. దీంతో భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించడంతో గ్రామస్తులు కొంతమంది ఘటనా స్థలానికి చేరుకుని అక్రమ మైనింగ్‌దారుడిని నిలదీశారు. దీంతో అతను వారిని బెదిరించడంతో మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అయితే మైనింగ్ అధికారులు పట్టించుకోవకపోవడంతో కొండాపురం తహసీల్దార్ కోటేశ్వరరావుకు పలుమార్లు ఫోన్‌లో తెలిపారు. గత్యంతరం లేక రెవెన్యూ సిబ్బందిని పంపి అక్కడ ఉన్న పొక్లెయినర్ తాళం తీసుకెళ్లిన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే బ్లాస్టింగ్ కోసం ఉపయోగించిన వాహనాన్ని మాత్రం అక్కడే వదిలి వేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా క్వారీలో పేలుళ్లు చేస్తున్నా, ఆ వాహనాన్ని మాత్రం పోలీసులు స్వాధీనం చేసుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అక్రమ మైనింగ్ కార్యకలాపాలు ఆపకపోతే రెవెన్యూ, పోలీసు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన


పోస్టర్లను ప్రదర్శిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: సేంద్రియ ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఆనంద్, జేసీ కార్తీక్, జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి పి.సత్యవాణి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా ఖర్చును తగ్గించవచ్చన్నారు. బుచ్చి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు రామ్మోహన్‌రెడ్డి పాల్గొని తాను పీఎండీఎస్ సంచులు, జీవన ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు పొందిన అనుభవాన్ని పంచుకున్నారు.